సాక్షి
విజయనగరం
మంగళవారం । 17 । జూన్ । 2025



జగన్ అంటే నమ్మకం... చంద్రబాబు అంటే మోసం

కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు చేకూరిన లబ్ధి ఏదీ లేదని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు ఆరోపించారు. - 8లో



ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు

ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో పేదలకు ఉచితంగా సీట్లు కేటాయించకపోతే చర్యలు తప్పవని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ హెచ్చరించారు. - 8లో



ఇరువర్గాల కొట్లాట

జియ్యమ్మ వలస మండలంలోని తురక నాయుడు వలస గ్రామంలో హరిజనులు, ఎరగ్రొల్లల మధ్య కొట్లాట జరిగింది. - 8లో

న్యూస్‌రీల్

3,594 మంది టీచర్లకు స్థాన చలనం

- 97 మందికి ఉద్యోగోన్నతులు
- ముగిసిన బదిలీ, ఉద్యోగోన్నతుల తంతు



విజయనగరం అర్బన్: జిల్లా విద్యాశాఖలో నెల రోజులుగా సాగిన బోధన సిబ్బంది బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ తంతు ఎట్టకేలకు ముగిసింది. బదిలీ అయిన, ఉద్యోగోన్నతి పొందిన ఉపాధ్యాయులు సోమవారం నూతన స్థానాల్లో విధులకు హాజరయ్యారు. బదిలీ షెడ్యూల్‌కు ముందు చేపట్టిన ఉద్యోగోన్నతి ప్రక్రియలో వివిధ కేడర్లకు చెందిన 97 మంది ఉపాధ్యాయులు ఉద్యోగోన్నతి పొందారు. అనంతరం ఏర్పడిన ఖాళీలతో పాటు, క్లియర్ వేకెన్సీ, తప్పనిసరి బదిలీ స్థానాలు, రిక్వెస్ట్ బదిలీ టీచర్లకు చేపట్టిన బదిలీ షెడ్యూల్‌లో 3,594 మందికి స్థాన చలనం జరిగింది. బదిలీ అయిన వారిలో హెచ్‌ఎంలు 69 మంది, మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంలు 275, స్కూల్ అసిస్టెంట్, తత్సమాన కేటగిరీ ఉపాధ్యాయులు 1,345 మంది, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, తత్సమాన కేటగిరీ ఉపాధ్యాయులు 1,816 మంది, భాషా పండితులు 60 మంది, పీఈటీలు 26 మంది, ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ మరియు ఇతరులు ముగ్గురు ఉన్నారు.

సీతంపేట వైపు ఏనుగులు



తాడేలవలస సమీపంలో ఏనుగుల గుంపు

భామిని/సీతంపేట: భామిని మండలంలో అల్లకల్లోలం సృష్టించిన ఏనుగుల గుంపు సీతంపేట ఏజెన్సీలోకి సోమవారం ప్రవేశించాయి. భామిని మండలం పోలవరం నుంచి పోలీస్ కోట మీదుగా సీతంపేట మండలం చిన్నబగ్గ, తాబేలవలస గ్రామాలకు చేరుకున్నట్టు అటవీశాఖాధికారులు తెలిపారు. వర్షాలు కురుస్తుండడంతో ఏనుగుల గుంపు పల్లపు ప్రాంతాల నుంచి మెట్ట ప్రాంతాలకు తరలివెళ్తున్నట్టు భావిస్తున్నారు. ఎఫ్‌బీవో దాలినాయుడుతో పాటు సిబ్బంది ఏనుగులు సంచరించే వైపు ఎవ్వరినీ వెళ్లనీయకుండా హెచ్చరికలు జారీ చేస్తున్నారు.



వేలిముద్ర వేస్తేనే.. సాగు సాయం!

- అన్నదాత సుఖీభవ కావాలంటే ఈకేవైసీ చేసుకోవాల్సిందే..
- కొత్త నిబంధన పెట్టిన కూటమి సర్కారు
- ఈ నెల 20వ తేదీ వరకే గడువు..
- లబ్ధిదారుల సంఖ్య తగ్గించడానికేనంటూ రైతన్నలు మండిపాటు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2.58 లక్షల మందికి సాగుసాయం
- ఈకేవైసీ కోసం ప్రస్తుతం జిల్లాకు వచ్చిన జాబితా 2.26 లక్షలు
- ప్రభుత్వ నిబంధనలతో ఈ సంఖ్య తగ్గే అవకాశం

'కొల్లు భవానీ అనే మహిళకు గంట్యాడ మండలం నందాం గ్రామంలో 10 సెంట్లు భూమి ఉంది. ఆమెకు గతంలో రైతు భరోసా పథకం కింద ఆర్థిక సాయం అందింది. కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కోసం రైతు సేవా కేంద్రంలో ఈకేవైసీ చేయించుకోవాలని చెప్పింది. ఈకేవైసీ చేయించుకోవడానికి నరవ రైతుసేవా కేంద్రానికి వెళ్తే ఇన్‌ఎలిజిబుల్ అని వచ్చింది. దీంతో ఆమె నిరాశతో వెనుదిరిగింది.'

ఇదే గ్రామానికి చెందిన సంక్రాన రామకృష్ణకు 0.09 సెంట్లు ఉంది. ఇతనికి గతంలో వైఎస్సార్ రైతు భరోసా సాయం అందింది. కాని ప్రస్తుతం ఈకేవైసీ చేయించుకోవడానికి నరవ రైతు భరోసా కేంద్రానికి వెళ్తే ఇన్‌ఎలిజిబుల్ అని వచ్చింది. దీంతో నిరాశతో వెనుదిరిగారు.



తప్పని నిరీక్షణ

చిత్రంలో ఈకేవైసీ కోసం నిరీక్షిస్తున్నది బాడంగి మండలం భీమవరం రైతులు. వేలిముద్ర వేస్తేనే అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి అందుతుందని, లేదంటే అందదని చెప్పడంతో భీమవరం ఆర్‌ఎస్‌కే (రైతు సేవా కేంద్రం) వద్ద ఇదిగో ఇలా సోమవారం గంటల తరబడి నిరీక్షించి ఈకేవైసీ పూర్తిచేసుకున్నారు. వర్షాలు కురుస్తున్నాయి.. ఖరీఫ్ పనులు ఆరంభమయ్యాయి.. పొలంబాట పట్టాల్సిన సమయంలో కూటమి ప్రభుత్వ విధానాలతో కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందంటూ రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గతంలో ఇలాంటి నిబంధనలు ఉండేవి కాదని, పాతవారికి యథావిధిగా పథకం వర్తించేదని, కొత్తవారి పేర్లు నమోదు చేసేవారని గుర్తుచేస్తున్నారు. ఇచ్చేది అరకొర.. అందులో కొర్రీలు అంటూ వాపోతున్నారు. – బాడంగి


విజయనగరం ఫోర్ట్:

సంక్షేమ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం కొర్రీలకు లబ్ధిదారులు వర్రీ అవుతున్నారు. రైతు సేవా కేంద్రాలకు (ఆర్‌ఎస్‌కే) పరుగులు తీస్తున్నారు. ఈకేవైసీ అయితేనే అన్నదాత సుఖీభవ పథకం అందుతుందని స్పష్టం చేయడంతో పనులు మానుకుని రైతులు ఆర్‌ఎస్‌కేల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. పొట్టకూటికోసం వలసబాట పట్టిన సన్న, చిన్నకారు రైతులు మొర్రోమంటూ గ్రామాలకు వస్తున్నారు. వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద రైతులకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏడాదికి రూ.13,500 చొప్పున ఐదేళ్లపాటు ఠంచన్‌గా ఆర్థిక సాయాన్ని అందించింది. రైతులకు ఎటువంటి నిబంధన పెట్టకుండా సాగుసాయం చేసింది. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక మొదటి ఏడాది రైతులకు అన్నదాత సుఖీభవ



భోగాపురం మండలంలో రైతులకు ఈకేవైసీ చేస్తున్న విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్

పథకం కింద రూపాయి సాయం కూడా అందజేయలేదు. రెండో ఏడాది అమలుచేస్తామన్న పథకానికి నిబంధనలు విధించింది. ఆర్‌ఎస్‌కేలో వేలిముద్ర (ఈకేవైసీ)ను తప్పనిసరి చేసింది. 10 సెంట్లు లోపు భూమి ఉన్న వారు అన్నదాత సుఖీభవ పథకానికి అనర్హులని ప్రకటించింది. లబ్ధిదారుల సంఖ్యను తగ్గించడానికే కూటమి ప్రభుత్వం కొత్త నిబంధనలు పెడుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



అప్పుడు అలా.. ఇప్పుడిలా..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతుభరోసా కింద 2.58 లక్షల మంది రైతులు లబ్ధి పొందారు. కూటమి సర్కారు అన్నదాత సుఖీభవ పథకం కోసం 2.26 లక్షల మంది రైతులకు ఈకేవైసీ చేయాలని వ్యవసాయశాఖకు జాబితా పంపింది. జిల్లాలో ఉన్న 505 రైతుసేవా కేంద్రాల్లో వ్యవసాయ సహాయ సంచాలకులు రైతులకు ఈకేవైసీ చేయిస్తున్నారు. ఈకేవైసీ గడువు ఈనెల 20వ తేదీ వరకు ఇవ్వడంతో లక్షలాది మంది రైతులకు ఈకేవైసీ సాధ్యమేనా అన్న సందేహం వ్యక్తమవుతోంది.

ఈకేవైసీ తప్పనిసరి

అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి రైతులకు ఈకేవైసీ చేయించాలని ఉన్నతాధికారుల నుంచి జాబితా వచ్చింది. ఆ జాబితా ప్రకారం ఈకేవైసీ చేయిస్తున్నాం.

– వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

సాగు సాయం ఇంకా అందని వైనం...

అధికారంలోకి వస్తే రైతులకు ఏటా సాగుపెట్టుబడి అందిస్తామని కూటమి సర్కారు గొప్పలు చెప్పింది. గద్దెనెక్కిన మొదటి ఏడాదే రైతులకు ఇచ్చిన హామీని విస్మరించింది. రెండో ఏడాది ఖరీఫ్ ఆసన్నమైనా ఇప్పటివరకు రూపాయం సాగు సాయం అందించలేదు. ఇప్పుడు కొత్తగా నిబంధనలు పెట్టడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

గర్భాం బీట్-1, బుట్ట మొక్కల పెంపక కేంద్రాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ సిబ్బంది



హరితహారాలుగా నగరవనాలు

- జిల్లాలో నాటేందుకు 20 లక్షల మొక్కలు సిద్ధం
- అటవీ ప్రాంతాల్లో నచ్చినట్లు రోడ్లు వేస్తామంటే కఠిన చర్యలకు సిద్ధం
- జిల్లా అటవీశాఖ అధికారి కొండలరావు

విజయనగరం గంటస్తంభం: నగరవనాలు.. హరిత హారాలుగా ఆరోగ్యకర గాలిని అందిస్తాయి.. జిల్లాలో ఈ ఏడాది 20 లక్షల మొక్కలు నాటాలన్నది లక్ష్యం. ఈ మేరకు మొక్కలు సిద్ధం చేశాం. మియావాకి పద్ధతిలో మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నాం. తక్కువ ప్రాంతంలో ఎక్కువ మొక్కలు పెంచడమే ఈ జపనీస్ పద్ధతి ప్రత్యేకత. జిల్లాలో మూడు నగరవనాలను అభివృద్ధి చేస్తున్నాం. సారిపల్లిలో పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చింది. బేతనాపల్లి, కొండవెలగాడల్లో పనులు జరుగుతున్నాయి. నగరంలో ఆక్సిజన్ స్థాయిని పెంచేందుకు ఇవి దోహదపడతాయి. ప్రతి నగర వనంలో పర్యావరణ విద్యకు సంబంధించి ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని జిల్లా అటవీశాఖ అధికారి ఆర్.కొండలరావు తెలిపారు. 'సాక్షి'తో సోమవారం ఆయన మాట్లాడారు. మొక్కల పెంపకం, అటవీప్రాంత పరిరక్షణ చర్యలను వివరించారు.



జిల్లా అటవీ శాఖ అధికారి ఆర్.కొండలరావు

మియావాకి పద్ధతి మంచిది..

- ఈ పద్ధతిలో తక్కువ సమయంలో దట్టమైన, స్థానిక అడవులను సృష్టించవచ్చు. తక్కువ స్థలంలో ఎక్కువ మొక్కలను నాటడం ద్వారా సహజ అడవులను అనుకరించడం జరుగుతుంది.
- వివిధ రకాల మొక్కలను ఒకే ప్రదేశంలో నాటడం వల్ల బహుళ అంతస్తుల అడవిని సృష్టించవచ్చు.
- ఇవి గ్లోబల్ వార్మింగ్ ప్రభావాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. జీవవైవిధ్యం సాధ్యమవుతుంది.
- భూగర్భ జలాల నిల్వ, భూమిని చల్లగా ఉంచడం, ధ్వని, ధూళి నివారణ, నేలల పరిరక్షకు దోహదపడుతుంది.



నర్సరీ నుంచి రైతులకు ఉచితంగా సరఫరా చేస్తున్న మొక్కలు

జూన్- సెప్టెంబర్...

వర్షాకాలంలో ఉపాధి హామీ నిధులతో సుమారు 20 లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. జూన్ నుంచి సెప్టెంబర్ మధ్యలో వివిధ ప్రభుత్వ శాఖలు, ప్రైవేటు కార్యాలయాలు, పంచాయతీలు, రైతులు, పరిశ్రమలు, పాఠశాలల ఆవరణ, రహదారుల పక్కన మొక్కలు నాటుతాం. ఎవరికైనా మొక్కలు కావాలంటే అటవీశాఖ అధికాలను సంప్రదించాలి.

ఆక్రమిస్తే కఠిన చర్యలు...

వనాల సంరక్షణపై రేంజ్, సెక్షన్ అధికారుల స్థాయిలో సమీక్ష నిర్వహించి, పలు సూచనలిచ్చాం. చెట్ల నరికివేత, అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. రిజర్వు ఫారెస్ట్‌లో ఆక్రమణలు, చెట్ల నరికివేత వంటివి జరిగితే కేసులు పెడతాం. వన్యప్రాణులను వేటాడి తరలించేవారిపై కేసులు నమోదు చేస్తున్నాం. ఇటీవల జొన్నాడ వద్ద అక్రమంగా తరలిస్తున్న ఉడుమును పట్టుకుని విశాఖపట్నం 'జూ'కు తరలించాం. అటవీ ప్రాంతంలో ఇష్టారాజ్యంగా రోడ్లు వేస్తే అడ్డుకుంటాం.

ప్రజల భాగస్వామ్యంతో మొక్కల రక్షణ

మొక్కల సంరక్షణకు ప్రజలను భాగస్వాములను చేస్తాం. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా, వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచిస్తున్నాం. అధికారులు, స్వయం సహాయక బృందాలు, విద్యాలయాలు, సంస్థలు, విద్యార్థులు ఇలా.. అన్నివర్గాల వారు మొక్కల సంరక్షణలో భాగస్వాములైతే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుంది.

మొక్కల సరఫరా ఇలా..

- టేకు, కొబ్బరి, జీడిమామిడి తదితర మొక్కలను రైతులకు ఉచితంగా సరఫరా చేస్తాం.
- ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద పెంచబడిన పొడవైన మొక్కలను పీడీ, డీడబ్ల్యూఎంఏ, డీఆర్‌డీఏ, ఇతర ప్రభుత్వ విభాగాలకు ఉచితంగా సరఫరా చేస్తారు.
- సీఏఎంపీఏ పథకం కింద పెంచిన మొక్కలను ప్రభుత్వ విభాగాలు, పరిశ్రమలు, ప్రైవేట్ సంస్థలకు ఖర్చు ప్రాతిపదికన మాత్రమే సరఫరా చేస్తారు.

నేలపైనే వైద్యం

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలోని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి నాలుగు రోజులుగా రోగుల తాకిడి పెరిగింది. బెడ్‌లు చాలడం లేదు. ఇద్దరు ముగ్గురికి ఒకే బెడ్ పైన, వరండాలో నేలపైనే రోగులను ఉంచి వైద్యులు సేవలందిస్తున్నారు. ఇక్కడ గత జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం తలపెట్టిన ఆస్పత్రి భవనాన్ని పూర్తిచేసి ఉంటే ఈ కష్టాలు ఉండేవి కావని రోగులు, వారి బంధువులు చెబుతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి ఆస్పత్రిలో అదనపు బెడ్‌లువేసి వైద్యసేవలందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఆస్పత్రి వరండాలోనే వైద్యసేవలు పొందుతున్న రోగులు



ఒకే బెడ్‌పై ఇద్దరిముగ్గురికి వైద్యసేవలు ఇలా...

అమ్మో.. మలేరియా..!

- సీతంపేట ఏరియా ఆస్పత్రికి రోగుల తాకిడి
- ఒకే రోజు 23 మందికి మలేరియా పాజిటివ్
- 349 ఓపీ నమోదు
- ఇందులో జ్వర పీడితులు 91 మంది



ఏరియా ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్లు

సీతంపేట: ఏజెన్సీలో మలేరియా కేసులు పెరుగుతున్నాయి. గిరిజనుల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో ఆస్పత్రులకు జ్వరపీడితుల తాకిడి ఎక్కువైంది. సీతంపేట ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. సోమవారం 349 ఓపీ నమోదుకాగా, ఇందులో 91 మంది జ్వరపీడితులే. వీరిలో 23 మందికి మలేరియా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. ఇన్‌పేషెంట్లుగా 39 మంది చేరారు. రోగులందరికీ మెరుగైన వైద్యసేవలందిస్తున్నట్టు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డి.వి. శ్రీనివాస్ తెలిపారు. గిరిజన ప్రజలు కాచిచల్లార్చిన నీటిని తాగాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు.

తల్లికి వందనం తిప్పలు

దత్తిరాజేరు: తల్లికి వందనం పథకం లబ్ధిదారులకు తిప్పలు తప్పడం లేదు. 300 యూనిట్లు దాటి విద్యుత్ బిల్లులు వచ్చిన వారికి పథకాన్ని నిలిపివేయడంతో ఆవేదన చెందుతున్నారు. అసలు 300 యూనిట్లు విద్యుత్ వినియోగించకుండానే వినియోగించినట్టు చూపి పెదమానాపురంలో 60 మందికి పథకాన్ని వర్తింపజేయకపోవడంపై ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. విద్యుత్ శాఖాధికారి నుంచి తీసుకున్న పత్రాలను పెదమానాపురం సచివాలయం సిబ్బందికి సోమవారం అందజేశారు.



తల్లికి వందనం రాకపోవడంతో పెదమానాపురం సచివాలయం వద్ద లబ్ధిదారుల ఆందోళన

నిరసన హోరు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



వాహన మిత్ర సాయం అందజేయాలంటూ ఆటో యూనియన్ నాయకుల ఆందోళన



కలెక్టరేట్ వద్ద జిందాల్ భూ నిర్వాసితుల ఆందోళన

కూటమి ప్రభుత్వ తీరుపై కలెక్టరేట్ సాక్షిగా నిరసన హోరెత్తింది. సంక్షేమ పథకాల అమలులో అడ్డగోలు నిబంధనలపై అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, మున్సిపల్ కార్మికులు, అంగన్‌వాడీ సిబ్బంది పోరుబాట సాగించారు. కలెక్టరేట్ వద్ద సోమవారం ఆందోళన చేశారు. అంగన్‌వాడీ వర్కర్లకు నెలకు రూ.11,500, మినీ అంగన్‌వాడీ వర్కర్లకు రూ.7వేలు జీతం ఇస్తుంటే తల్లికి వందనం పథకాన్ని ఎలా నిలిపివేస్తారంటూ నిలదీశారు. తక్షణమే సంక్షేమ పథకాలను వర్తింపజేయాలంటూ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బి.పైడిరాజు, సంఘ నాయకులు వి.లక్ష్మి, రత్నావతి, పి.రేణుక, పి.రూప, తదితరులు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

- జిందాల్ పరిశ్రమ పనులు పూర్తిచేసి యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించాలంటూ నిర్వాసితులు డిమాండ్ చేశారు.
- కూటమి ప్రభుత్వం వచ్చాక ఆటో డ్రైవర్లకు గత ప్రభుత్వం అందజేసే వాహన మిత్ర పథకాన్ని నిలిపివేసింది.. ఈ చలనా, ఫెనాల్టీల పేరుతో వేధింపులకు గురిచేస్తోంది.. ప్రైవేటు ఫిట్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటుచేసి ఆర్థిక భారం మోపుతోంది.. ఆటో స్టాండ్‌లో నిలిపిన వాహనాలపై కూడా 336 సెక్షన్ కింద పోలీసులు కేసులు బనాయిస్తున్నారు.. ఇంతటి అరాచక పాలనను ఎన్నడూ చూడలేదంటూ ఆటోడ్రైవర్లు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. బతుకుబండి ముందుకు సాగేందుకు సహకరించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ తీరుతో ఆటో డ్రైవర్లు పడుతున్న ఇబ్బందులను ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ కె.సురేష్, నాయకులు సీహెచ్ ముత్యాలు, డి.దేముడు, వై.వెంకటరావు, పి.వి.నారాయణరావు, ఎస్.సత్యనారాయణ, జి.అప్పలనాయుడు, ఆర్.అప్పలరాజు, ఎర్రినాయుడు, కుమార్, భాస్కరరావు, తదితరులు వినిపించారు.

– విజయనగరం ఫోర్ట్/ గంటస్తంభం

క్లుప్తంగా

పాఠశాలలో ప్రొజెక్టర్ చోరీ

రామభద్రపురం: మండలకేంద్రంలోని అగురు వీధి ప్రాథమిక పాఠశాలలో కయాన్ ప్రొజెక్టర్ చోరీకి గురైంది. ఈ చోరీపై పాఠశాలకు చెందిన ఇద్దరు టీచర్లతో కలిసి హెచ్ఎం బి.తిరుపతిరావు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. హెచ్ఎం తెలిపిన వివరాల ప్రకారం డిజిటల్ తరగతుల నిర్వహణలో భాగంగా 2022లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.1.30 లక్షలు విలువ చేసే కయాన్(ఇంటరాక్టివ్ ప్రొజెక్టర్)అందజేసింది. అయితే పాఠశాలల పునఃప్రారంభం తర్వాత శని,ఆదివారాలు సెలవుల్లో గుర్తు తెలియని దుండగులు తరగతి గది తాళం విరగొట్టి కయాన్ ప్రొజెక్టర్ దొంగతనానికి పాల్పడ్డారు. పాఠశాలకు చెందిన స్కావెంజర్ ఆదివారం ఉదయం తరగతి గదులు పరిశుభ్రం చేయడానికి వెళ్లి తలుపుల తాళం విరగ్గొట్టి ఉండడం ప్రొజెక్టర్ చోరీ జరిగినట్లు గుర్తించి తనకు సమాచారం ఇవ్వగా వెంటనే పాఠశాలకు చేరుకుని పరిశీలించి తోటి టీచర్లతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఫిర్యాదు మేరకు ఎస్సై వి.ప్రసాదరావు పాఠశాలకు చేరుకుని చోరీ జరిగిన తరగతి గదితో పాటు పాఠశాల ఆవరణంతా పరిశీలించారు. ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్నామని ఎస్సై తెలిపారు.

10 మంది జూదరుల అరెస్ట్

పూసపాటిరేగ: మండలంలోని కొల్లాయివలస సమీపంలో మామిడి తోటలో పేకాట ఆడుతున్న పదిమందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఐ.దుర్గాప్రసాద్ తెలియజేశారు. వారి నుంచి రూ.14,210 నగదు, 4 మోటార్ సైకిల్స్, 9 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తులను కోర్టుకు తరలిస్తామ న్నారు.

గంజాయి మత్తులో విద్యార్థిపై దాడి


దాడిలో గాయపడిన మహేంద్ర లక్ష్మణ్ కుమార్

విజయనగరం క్రైమ్: నగరంలోని కేఎల్ పురానికి చెందిన సాగర్ మరోసారి గంజాయి మత్తులో ఆర్‌కే కళాశాలకు చెందిన విద్యార్థి మహేంద్ర లక్ష్మణ్ కుమార్‌పై దాడికి పాలపడ్డాడు. గతంలో కూడా సాగర్ గంజాయి మత్తులో ఇద్దరు విద్యార్థులపై దాడికి పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో బాధిత విద్యార్థి, తల్లిదండ్రులు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు, క్రైమ్ ఎస్సై సురేంద్రనాయుడు వివరాలను క్షుణ్ణంగా తెలుసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

నేలబావిలోపడి మతిస్థిమితంలేని వృద్ధుడి మృతి


బావి ఒడ్డున వృద్ధుడి మృతదేహం

రాజాంసిటీ: నేలబావిలో పడి పట్టణ పరిధిలోని గొల్లవీధికి చెందిన బొబ్బిలి లక్ష్మణ (69) అనే మతిస్థిమితంలేని వ్యక్తి మృతిచెందాడు. దీనికి సంబంధించి ఎస్సై వై.రవికిరణ్ సోమవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లక్ష్మణ కొద్ది సంవత్సరాలుగా మతిస్థిమితం కోల్పోయి అప్పుడప్పుడు ఇంటి నుంచి ఒకటి రెండు రోజులు ఎటో వెళ్లిపోయి మళ్లీ వస్తుంటాడు. ఈ క్రమంలోనే ఈ నెల 15న మధ్యాహ్నం భోజనం అనంతరం ఎటో వెళ్లిపోయాడు. రాత్రి సమయం అయినా రాకపోవడంతో కుటుంబసభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. తన భర్త తెలగవీధిలోని శ్మశాన వాటిక వద్ద బావికి స్నానానికి వెళ్తుండేవాడని వృద్ధుడి భార్య నారాయణమ్మ భావించి సోమవారం తెల్లవారుజామున కుటుంబసభ్యులతో వెళ్లి చూడగా బావి ఒడ్డున లక్ష్మణ చేతికర్ర ఉండడంతో బావిలోకి చూశారు. బావిలో మృతదేహం తేలియాడడంతో పోలీసులకు మృతుని భార్య ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

జగన్ అంటే నమ్మకం... చంద్రబాబు అంటే మోసం

- ఏడాది పరిపాలనలో అవినీతి, మోసం, కేసులు
- ఒక్క పథకం పూర్తి చేయకుండా విడ్డూరంగా మాట్లాడుతున్న సీఎం
- జిల్లాలో మూసివేత దిశగా పరిశ్రమలు
- భోగాపురం విమానాశ్రయం పనులకు ప్రభుత్వ సహకారం లేదు
- ప్రభుత్వ వైద్యం పడకేసినా పట్టించుకునే నాథుడే లేడు
- ప్రజల తరఫున వైఎస్సార్‌సీపీ పోరాటం
- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పీఏసీ మెంబర్ బెల్లాన చంద్రశేఖర్


జగన్ అంటే నమ్మకం... చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాన్ని విడుదల చేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పీఏసీ మెంబర్ బెల్లాన చంద్రశేఖర్, తదితరులు

చీపురుపల్లి: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో కేసులు, మోసాలు, అవినీతి, అబద్ధాలు, దాడులు, దోపిడీలు తప్ప.. ప్రజలకు చేకూరిన లబ్ధి ఏదీ లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది మోసాలు, అప్రజాస్వామిక పరిపాలనపై వైఎస్సార్‌సీపీ అధిష్టానం ముద్రించిన 'జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం' అనే పుస్తకాలను సోమవారం సాయంత్రం చీపురుపల్లి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ ఎంపీ, రాష్ట్ర పొలిటికల్ అడ్వయిజరీ కమిటీ మెంబర్ బెల్లాన చంద్రశేఖర్‌తో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 జూన్ 12 నుంచి 2025 జూన్ 12 వరకు కూటమి ప్రభుత్వ పరిపాలన, 2019 జూన్ నుంచి 2020 జూన్ వరకు వైఎస్సార్‌సీపీ పరిపాలనలో సంక్షేమ పథకాలు అమలు, అభివృద్ధి సంస్కరణలు బేరీజు వేస్తూ పుస్తకాన్ని ముద్రించడం జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో మేనిఫెస్టోలోని అంశాలన్నీ అమలు చేసి ఏడాదిలోనే ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిన సంగతిని గుర్తుచేశారు.

- నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని నిరుద్యోగ యువతను మోసం చేశారని, 20 లక్షలు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఉన్న ఉద్యోగాలు ఊడగొట్టారని అన్నారు.

- ఏడాది కూటమి పరిపాలనలో పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు రావాల్సిన జనరల్ ఫండ్స్ ఒక్క రూపాయి కూడా జమ కాలేదన్నారు. అలాగే 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా రాలేదన్నారు. దీనిపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు లేఖ రాసినా సమాధానం రాలేదన్నారు. పంచాయతీలు నిర్వీర్యం అయిపోతున్నాయని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆరోపించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇప్పుడు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

- ఏడాది కూటమి పాలనలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుతో పాటు ప్రజల గొంతు వినిపిస్తున్న సాక్షిపై దాడులు, జర్నలిస్టులు అరెస్టులతో అప్రజాస్వామిక పరిపాలన సాగిందన్నారు. బడ్జెట్‌లో సంక్షేమ పథకాల అమలుకు కేటాయింపులు లేవన్నారు. ఎంతో అనుభవం కలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ అమలు పూర్తయిందని ఎలా చెబుతున్నారో అర్థం కావడం లేదన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయకుండానే ఏడాదిలో కూటమి ప్రభుత్వం రూ.1.60 వేల కోట్లు అప్పు చేసిందన్నారు.

- అధికారంలోకి రాగానే పింఛన్ రూ.4 వేలు చేశామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం ఏడాదిలో ఒక్క కొత్త పింఛన్ అయినా ఇచ్చారా చెప్పాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కోసం రూ.4వేలు నుంచి రూ.5 వేలు కోట్లు అవసరంకాగా, కేవలం వెయ్యి కోట్లు మాత్రమే కేటాయించి పథకం అమలు పూర్తయినట్లు సీఎం చంద్రబాబు హుందాగా అబద్ధం చెప్పేయడం విడ్డూరంగా ఉందన్నారు.

- గత ప్రభుత్వం భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు శంకుస్థాపన చేసి 23 శాతం పనులు పూర్తిచేసిందని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ వరకు 2026కు ప్రారంభించేలా పనులు చేయాలన్నారు. లేదంటే ప్రజలకు సమాధానం చెప్పాల్సి ఉంటుందన్నారు.

- జిల్లాలో అభివృద్ధి లేదు సరికదా ఉన్న పరిశ్రమలు మూతపడుతున్నాయన్నారు. కొత్తవలసలో జిందాల్ పరిశ్రమ మూసివేశారని, సంకిలి చక్కెర కర్మాగారం కూడా మూసివేత దిశగా అడుగులు పడుతున్నాయని యాజమాన్యంతో మాట్లాడినట్లు చెప్పారు.

- తల్లికి వందనం పథకంలో భాగంగా రాష్ట్రంలో దాదాపు 84 లక్షలు మంది పిల్లలకు రూ.11 వేల కోట్లు నుంచి రూ.12 వేల కోట్లు లబ్ధిచేకూర్చాల్సి ఉండగా, కేవలం రూ.8 వేల కోట్లు కేటాయించి చేతులు దులుపుకుందన్నారు.

మాట తప్పడంలో చంద్రబాబు టాపర్

ఎన్నికల ముందు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత మాట తప్పడం, పేద ప్రజలను మోసం చేయడంలో సీఎం చంద్రబాబు టాపర్ అని మాజీ ఎంపీ, రాష్ట్ర పొలిటికల్ అడ్వయిజరీ కమిటీ (పీఏసీ) సభ్యుడు బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. విద్యుత్ బిల్లులను విపరీతంగా పెంచి, ఇప్పుడు దానినే సాకుగా చూపుతూ తల్లికి వందనం పథకంలో కోత వేయడం విచారకరమన్నారు. కార్యక్రమంలో నాఫెడ్ డైరెక్టర్ కె.వి.సూర్యనారాయణరాజు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, గుర్ల జెడ్పీటీసీ సభ్యుడు శీర అప్పలనాయుడు, చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, మీసాల వరహాల నాయుడు, బెల్లాన వంశీకృష్ణ, మీసాల విశ్వేశ్వర రావు, బమ్మిడి కార్తీక్, గుడివాడ శ్రీరాములు, వలిరెడ్డి లక్ష్మణ, కోట్ల వెంకటరావు, తాడ్డి వేణు, పొట్నూరు సన్యాసప్పలనాయుడు, బెల్లాన బంగారునాయుడు, తోట తిరుపతిరావు, స్వామినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

- ఆడబిడ్డ నిధికింద నెలకు రూ.1500 ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక పీ4 మ్యాచ్ చేస్తుందని చెబుతున్నారని, అసలు పీ4 అంటే ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు సంగతి పక్కన పెడితే ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలిండర్లని ఒక్క సిలిండర్ ఇచ్చి పథకం పూర్తయిందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

పీజీఆర్ఎస్‌కు 118 వినతులు


పార్వతీపురం టౌన్ అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్‌ఓ హేమలత

పార్వతీపురం టౌన్: పార్వతీపురం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహి ంచిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 118 వినతులు అందాయి. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికార ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్ సెల్‌కు 24 ఫిర్యాదులు


పార్వతీపురం రూరల్: అర్జీదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఏఎస్పీ అంకిత సురానా

పార్వతీపురం రూరల్: ఎస్పీ కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు పార్వతీపురం ఏఎస్పీ అంకిత సురానా అన్నారు. ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీసు శాఖ కార్యాలయంలో ఆమె ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు ఇచ్చిన 24 ఫిర్యాదులను నేరుగా ఆమె స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఫిర్యాదులపై సంబంధిత పోలీస్‌స్టేషన్లకు ఫోన్ ద్వారా వివరాలను తెలియజేసి వాటిని క్షుణ్ణంగా పరిశీలించి పూర్వాపరాలపై విచారణ చేసి చట్టపరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని, అలాగే ఆ నివేదికను జిల్లా ఎస్పీ కార్యాలయానికి విధిగా పంపాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ ఆదామ్ తదితర పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఐటీడీఏ గ్రీవెన్స్ సెల్‌కు 60 అర్జీలు


సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న పరిపాలనాధికారి సునీల్

సీతంపేట: ఐటీడీఏలోని శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం పరిపాలనాధికారి వి.సునీల్ ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. 60 మంది గిరిజనులు తమ సమస్యలపై అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ డీఈ సింహాచలం, జీసీసీ మేనేజర్ నరసింహులు, ఏఈ నీలిమ,హెచ్‌వో జయశ్రీ, ఏఎంవో కోటిబాబు, ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ ఎస్.జాకాబ్‌దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల సంచారంతో అప్రమత్తంగా ఉండాలి


ఏనుగుల సంచారంపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సర్పంచ్, అటవీశాఖ అధికార సిబ్బంది

బొబ్బిలి రూరల్: మండలంలోని ముత్తాయివలస గ్రామ శివారు ప్రాంతంలో తిష్టవేసిన అడవి ఏనుగులతో అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ పిల్లా వసుంధర, అటవీశాఖ అధికారులు గ్రామస్తులను హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ఏనుగుల సంచార ప్రాంతానికి చేరుకుని ఏనుగుల దాడినుంచి తప్పించుకునే అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పశువులను, మేకలను ఏనుగు లున్న ప్రాంతాలవైపు తరలిపోకుండా చూసుకోవాలని,నిత్యం అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులకు వివరించారు.అటవీశాఖ అధికార సిబ్బంది ఎప్పకప్పుడు సమాచారం అందిస్తారని అందుకు అనుగుణంగా మెలగాలని సూచించారు. వాటికి హానికలిగించే చర్యలు చేపట్టవద్దని, ఆందోళన చెందవద్దని సూచించారు.

సామాన్యుల వరకు యోగా చేరువ కావాలి

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

పార్వతీపురంటౌన్: జిల్లాలో సామన్య మానవుడి వరకు యోగాను తీసుకు వెళ్లాలనేదే యోగాంధ్ర లక్ష్యమని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో యోగాంధ్ర, డీఏ జుగా, సీఎం సూర్యఘర్, పీఎం జన్‌మన్ తదితర అంశాలపై జిల్లా, మండల అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా లక్ష ప్రాంతాల్లో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించి యోగాను ప్రతి ఒక్కరూ దినచర్యలో భాగం చేయాలనేదే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. అందులో భాగంగా గత 25 రోజులుగా జిల్లాలో యోగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ప్రభుత్వం రూపొందించిన కొన్ని పారామీటర్స్‌లో జిల్లా ప్రథమ స్థానంలో నిలవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఇందుకు కృషిచేసిన అధికారులను కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. ఇప్పటివరకు యోగాభ్యాసంలో భాగంగా మాత్రమే కార్యక్రమాలను చేపట్టామని, ఇదేస్ఫూర్తితో ఈ నెల 21వ తేదీన నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పిల్లలు, పెద్దలను భాగస్వాములను చేసి జిల్లా ముందంజలో ఉండేలా కృషిచేయాలని అధికారులను కోరారు.

సీఎం సూర్యఘర్‌కు మనవాళ్లే ప్రచార కార్యకర్తలు

సీఎం సూర్యఘర్ పథకానికి ప్రభుత్వ ఉద్యోగులే ప్రచారకర్తలని కలెక్టర్ పేర్కొన్నారు. సూర్యఘర్ యూనిట్లు ప్రతి ఒక్క కుటుంబం వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని ఏపీఈపీడీసీఎల్ అధికారులను ఆదేశించారు.

పీఎం జన్‌మన్ గృహాలు వేగవంతం కావాలి

జిల్లాలో పీఎం జన్‌మన్ గృహాలు మరింత వేగవంతం కావాలని, ప్రతివారం ప్రగతి కనిపించాలని, లేకుంటే ఉపేక్షించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. కురుపాం, సీతంపేట, జీఎల్ పురం మండలాల్లో ప్రగతి కనిపించకపోవడం పట్ల కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. వీలైనంత త్వరగా గృహ నిర్మాణాలు గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని మునిసిపల్ కమిషనర్లను కలెక్టర్ ఆదేశించారు.

ఉచిత సీట్లు ఇవ్వకపోతే ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు

- కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్
- పీజీఆర్ఎస్‌కు 190 వినతులు


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: ప్రైవేట్ పాఠశాలల్లో 1వ తరగతిలో పేదలకు ఉచితంగా కేటాయించిన సీట్లను ఇచ్చే చట్టాన్ని అమలు చేయకపోతే చర్యలు తప్పవని కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ స్పష్టం చేశారు. విద్యా హక్కు చట్టాన్ని అనుసరించి ప్రతి ప్రైవేట్ పాఠశాలలో 25 శాతం సీట్లను ఉచితంగా పేదలకు కేటాయించాల్సి ఉండగా స్థానికంగా ఉన్న ఫోర్ట్ సిటీ, సన్, బీసెంట్, చాణిక్య స్కూల్స్‌లో సీట్లు కేటాయించడం లేదని పలువురు తల్లిదండ్రులు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత నాలుగు పాఠశాలల ద్వారా 240 సీట్లు కేటాయించాల్సి ఉందని వాటిని వెంటనే కేటాయించమని ఆదేశాలు జారీ చేయాలని డీఈఓ యూ.మాణిక్యంనాయుడికి సూచించారు.

పీజీఆర్ఎస్‌కు 190 వినతులు

ప్రజా వినతుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే వినతులను లాగిన్‌లో అధికారులు ఎప్పటికప్పుడు చూడాలని ఇంకనూ చూడవలసిన కాలమ్‌లో ఎప్పుడు చూసినా సున్నా కనపడాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ ఆదేశించారు. సోమవారం పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ ప్రజల నుంచి 190 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రోజు లాగిన్ అయి అధికారులు వినతులను చూడాలని అలాగే రీ ఓపెన్ కేసులు కూడా పూర్తిగా విచారణ జరిపి ముగించాలని తెలిపారు. గడువులోపల వినతులకు సమాధానాలు పంపాలని ఆదేశించారు.

ఎస్పీ గ్రీవెన్స్ సెల్‌కు 46 ఫిర్యాదులు



ఫిర్యాదు దారుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఏఎస్పీ సౌమ్యలత

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఏఎస్పీ సౌమ్యలత 46 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ వచ్చిన ఫిర్యాదు అంశాలను పరిశీలించి, పూర్వా పరాలపై విచారణ చేసి, వాస్తవమైతే చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలను నివేదిక రూపంలో జిల్లా పోలీసు కార్యాలయానికి పంపాలని సంబంధిత పోలీసు అధికారులను అదనపు ఎస్పీ పి.సౌమ్యలత ఆదేశించారు.

కార్యక్రమంలో డీసీఆర్బీ సీఐ బి.సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.


ఇరువర్గాల కొట్లాట


విచారణ చేస్తున్న డీఎస్పీ రాంబాబు, సీఐ తిరుపతిరావులు

జియ్యమ్మ వలస రూరల్: మండలంలోని తురక నాయుడు వలస గ్రామంలో హరిజనులు, ఎరగ్రొల్లల మధ్య కొట్లాట జరిగింది. జియ్యమ్మవలస పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆదివారం హరిజనవాడలో ఓ శుభకార్యం జరగడంతో సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో కార్యక్రమం ముగిసిన తరువాత అద్దె సామగ్రిని వ్యాన్‌పైకి ఎక్కిస్తున్న సమయంలో ఆ మార్గం గుండా ఎర్రగొల్లలకు చెందిన గొర్లి రాజు, గొర్లి చందులు స్కూటీపై వెళ్తూ దారికి అడ్డంగా ఉన్న సామగ్రిని తొలగించమని చెప్పగా, అక్కడే ఉన్న ఎత్తుల హరి కొద్ది నిమిషాలు ఓపిక పట్టమని చెప్పాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగి కొట్లాటకు దిగారు. ఈ కొట్లాట హరిజన పేటలో హరిజనులు, ఎర్ర గొల్లల మధ్య తీవ్ర స్థాయిలో జరిగింది. కొట్లాటలో పలువురికి గాయాలు కాగా ఇరువర్గాలు పోలీసులను ఆశ్రయించాయి. ఎర్ర గొల్లలు దౌర్జన్యానికి దిగుతూ తమపై కుల దూషణ చేశారంటూ హరిజనులు కేసు పెట్టగా, గొర్లి రాజు గొర్లి చందు, లక్ష్మి, గొర్లి మజ్జి, గొర్ల పాపారావులపై జియ్యమ్మవలస పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. దీంతో పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు, చినమేరంగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టీవీ తిరుపతిరావు సిబ్బందితో తురక నాయుడు వలస గ్రామంలో విచారణ చేపట్టారు. బాధ్యులపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించి ఇరువర్గాలను సమన్వయ పరిచారు. కార్యక్రమంలో జియ్యమ్మ వలస ఏఎస్సై ప్రశాంత్ కుమార్, చినమేరంగి ఎస్సై పి.అనీషలు పాల్గొన్నారు.

చికెన్		
బ్రాయిలర్		
లైవ్	డెస్‌డ్	స్కిన్‌లెస్
₹98	₹164	₹174

ఆటోను బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు


ఆటోను ఢీకొనడంతో గాయపడిన పాపినాయుడు

బొండపల్లి: మండలంలోని గొట్లాం గ్రామ జాతీయ రహదారిపై విజయనగరం నుంచి వస్తున్న ఆటోను గజపతినగరం నుంచి వెళ్తున్న ద్విచక్రవాహన చోదకుడు ఢీకొనడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. ఈ మేరకు బొండపల్లి ఎస్సై మహేష్ విలేకరులకు తెలిపారు. గాయపడిన వ్యక్తిని జిల్లా కేంద్రాసుపత్రికి తరలించామని చెప్పారు. గాయాల పాలైన వ్యక్తిని నెల్లిమర్ల మండలం తాళ్ల పూడి పేటకు చెందిన ధవళ పాపినాయుడుగా గుర్తించామన్నారు.

సారా తరలిస్తున్న ముగ్గురు నిందితుల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ సీఐ సూర్యకుమారి

పాలకొండ: సారా నిర్మూలనలో భాగంగా సోమవారం చేపట్టిన దాడుల్లో ముగ్గురు నిందితులను అరెస్టు చేశామని ఎక్సైజ్ సీఐ సూర్యకుమారి తెలిపారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. సీతంపేట మండలం దిగువ బుడగరాయి వద్ద దారి కాపలా కాయగా పాలకొండ మండలం ఓని గ్రామానికి చెందిన కనపాక నవీన్ 20 లీటర్ల సారా, బుడగరాయి గ్రామానికి చెందిన సవర మంగయ్య 10 లీటర్ల సారా తరలిస్తూ పట్టుబడినట్టు తెలిపారు. వారితో పాటు దిగువ బుడగరాయికి చెందిన పాత నేరస్తుడు సవర వెంకయ్యను అరెస్టు చేసి ముగ్గురిని కోర్టులో హాజరు పరిచామని తెలిపారు. సారా తయారీకి ఉపయోగించే బెల్లం విక్రయాలు చేపడుతున్న వీరఘట్టం మండలానికి చెందిన ఆరుగురు వ్యక్తులపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. నవోదయం 2 కార్యక్రమంలో భాగంగా సారా అమ్మకాలు చేస్తున్న గ్రామాలపై నిఘా ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు.

కొడుకును బడిలో చేర్చడానికి వచ్చి తండ్రి మృతి


మృతుడు చదల కన్నయ్య (ఫైల్)

పాచిపెంట: కొడుకును పాఠశాలలో చేర్పించడానికి వచ్చిన ఓ తండ్రి అకస్మాత్తుగా మృతి చెందిన సంఘటన పాచిపెంట మండల కేంద్రంలో సోమవారం విషాదం నింపింది. ఈ ఘటనపై వైద్యాధికారి, గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రాయిగుడ్డి వలస గ్రామానికి చెందిన చెదల కన్నయ్య కుమారుడు గౌతం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో నాలుగవ తరగతి చదువుతున్నాడు. అయితే పి.కోనవలస రెసిడెన్షియల్ పాఠశాలలో 5వ తరగతికి సీటు రావడంతో సోమవారం ఉదయం రికార్డ్‌షీట్ తీసుకుని పి.కోనవలస రెసిడెన్షియల్ పాఠశాలలో జాయిన్ చేసేందుకు పాచిపెంట గిరిజన ఆశ్రమ పాఠశాలకు వచ్చాడు. పాఠశాలకు వచ్చిన కొద్దిసేపటికే ఫిట్స్ రావడంతో కింద పడిపోయాడు. వెంటనే పాఠశాల సిబ్బంది, స్థానికులు పాచిపెంట పీహెచ్‌సీకి హుటాహుటిన తరలించారు. వైద్యాధికారి వెంకటరమణ పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు.